**కథ**

## సాయంసంధ్య వేళ...

# గులాబీలు

ఫ్రెష్‌గా తయారైంది అద్రిజ. ఆకుల చాటున ఉన్న గులాబీ మొగ్గలా ఉంది. ఆమె కట్టుకున్న చీర, బ్లౌజ్ పింక్ కలర్‌వి. అవేకాక గాజులు, బొట్టు, కమ్మలు ప్రతిదీ పింక్ కలర్‌వే. దాంతో మరింతగా మెరిసి చూపరులను మురిపించేలా ఉంది అద్రిజ.

కానీ అద్రిజ ముఖంలో కాస్తంత ఆందోళన కన్పిస్తోంది. కాలుగాలిన పిల్లిలా ఇంట్లోకీ బయటికీ తిరుగుతోంది. ఎవరి రాకకోసమో అభిసారికలాగా ఎదురు చూస్తోంది. అయినా ఆమె కోరిక ఫలించినట్టుగా లేదు. క్షణ క్షణానికి ఆమెలో అసహనం కొండలా పెరిగిపోసాగింది.

అన్ని కలర్‌లలోకెల్లా ఆమెకు ఇష్టమైన కలర్ పింక్. అచ్యుత్ ఆమె జీవన స్రవంతిలోకి ఎంటరైనప్పటి నుండీ 'పింక్' అంటే మరీ ఇష్టం పెరిగింది. కారణం! అచ్యుత్ రోజూ గులాబీలు ప్రజెంట్ చేసేవాడు. ఎన్ని రకాల పూలున్నా గులాబీలు తప్ప మరేవీ ప్రజెంట్ చేసేవాడు కాదు.

కాలేజీలో మొదలైన వాళ్ళ స్నేహం, ప్రేమగా మొగ్గ తొడిగింది. అప్పుడప్పుడూ దొంగచాటుగా సినిమా హాల్‌లోనో, పార్క్‌లోనో కల్సుకునేవారు. అద్రిజ రాక ఒక్క క్షణం ఆలస్యమైనా విలవిల్లాడిపోయేవాడు అచ్యుత్.

ఓ సినిమా ప్రోగ్రామ్‌కు అనుకోకుండా మిస్ కావాల్సి వచ్చింది అద్రిజకు. అతనితో చెప్పే టైమూ లేదు. తెల్లారి చూసిన అతన్లో ఏదో మార్పు కనిపించిందామెకు. ముఖంమాత్రం ప్రశాంతంగానే ఉంది కానీ ఏదోలా ఉన్నాడు అచ్యుత్.

''ఏమైంది?'' అంది చేయిపట్టి.

''ఓ... మైగాడ్! ఎంత టెంపరేచర్ ఉంది. నిన్న బాగానే ఉన్నావుగా? అంతలోనే ఈ జ్వరమేంటి'' అంది ఆదుర్దాగా.

అతను నవ్వి ఊరుకున్నాడు.

అప్పుడు పడిందామె కంట్లో!

అచ్యుత్ చేయిపైన తన పేరు పొడిచి ఉంది. అయితే పచ్చబొట్టుతో కాదు. గుండు పిన్నుతో పొడిచినట్లు ఉంది. ఆ ప్రాంతమంతా ఉబ్బిపోయింది, దాని వల్లనే జ్వరం. చివ్వున నీళ్లూరాయామె కళ్ళల్లో.

''ఎందుకు చేశావీ పని?''

''ఇందులో నా తప్పేంలేదు'' అన్నాడు కూల్‌గా.

''అంటే... తప్పంతా నాదా?''

''అవును'' అన్నాడు.

''ఏంటి నేను చేసిన తప్పు'' అంది ఉక్రోషంగా.

''నిన్న రాకపోవడమే'' చెప్పాడు.

''రాకపోవడం నాకేమన్నా సరదా అనుకున్నావా? అయినా నేను ఎందుకు రాలేదో తెల్సుకునేది పోయి ఇలాంటి పిచ్చిపన్లు చేస్తూ కూర్చున్నావా? ఆల్‌రైట్. ఇలా నేను రానప్పుడల్లా ఏదో ఒకటి చేసుకుంటూనే ఉంటావా?'' అంది కోపంగా.

''చేసుకుంటాను'' అన్నాడు స్థిరంగా అచ్యుత్.

''నీకు పిచ్చెక్కింది''

''నేను పిచ్చివాణ్ణే. నీ ప్రేమ పిచ్చోణ్ణి''

''ఆహా... పిచ్చోళ్ళతో మాట్లాడే అవసరం నాకు లేదు'' అంది తీవ్రంగా.

''సరే మాట్లాడకు తెల్లారేసరికి లోకంలోనే ఉండను'' అన్నాడు కఠినంగా.

అప్పటిదాకా పేరుకుపోయిన కోపమనే మంచు అతని మాటల వేడికి కరిగిపోయింది. నిజానికి ఆమెకు అతనిపై ఉన్నది కోపం కాదు. అతనికి ఏ చిన్న కష్టమొచ్చినా ఓర్చుకోలేని బేలతనం.

అతనికి ఆమెతోనే ప్రపంచం. ఆమె అరక్షణం కన్పించకున్నా బెంగపడే హృదయం.

అర్జంటుగా రూమ్‌కి రమ్మంటూ పిలిచాడు అద్రిజను. 'ఎందుకో' అనుకుంటూ గాభరాగా వెళ్ళింది.

''అద్రిజా...! అటు చూడు'' అన్నాడు గోడ మీదికి చూపిస్తూ. ఆ వైపు చూసిన అద్రిజకు ఏమీ అర్థం కాలేదు. ''ఏంటి?'' అది.

''సరిగ్గా చూడు''

అప్పుడు కన్పించాయామెకు గోడపై తినేసిన చూయింగ్ గమ్స్ ఎండిపోయి వున్నాయి.

అంతలోనే మరో విషయం గుర్తుకు వచ్చింది. తాము సినిమాకి వెళ్ళిన ప్రతీసారీ అచ్యుత్ చూయింగ్ గమ్స్ తేవడం. ఒకదాంట్లో చెరిసగం చేసుకుని తినడం. కాసేపయ్యాక ఒకళ్ళదింకొకళ్ళు మార్చుకోవడం.

''మన ప్రేమకు గుర్తుగా... నీ పెదవుల అమృతానికి సాక్షిలా వాటిని ఎంత భద్రంగా దాచానో చూడు'' అన్నాడు మురిపెంగా.

అమాంతం అతన్ని తన కౌగిట్లో బంధించేసింది. ఆనందం అంబరాన్ని తాకుతుంటే పట్టలేనట్లుగా.

''అబ్బా''

ఊహల వీధుల్లోంచి బయటకొచ్చింది.అద్రిజ చేయికి గులాబిముల్లు గుచ్చుకుంది. రక్తం రావడం లేదుగాని నొప్పి మాత్రం పెడుతోంది. అచ్చు అచ్యుత్‌లాగే అనుకుంది అద్రిజ.

ముల్లు గుచ్చిందని చెప్పినా రక్తం రావడం లేదు గనుక నొప్పి ఉందంటే ఎవ్వరూ నమ్మరు.

అలాగే అచ్యుత్ తనకు అన్ని సౌకర్యాలు అమరుస్తుండగా తనని నెగ్లెక్ట్ చేస్తున్నాడు అన్నా ఎవ్వరూ నమ్మరు అనుకుంది బాధగా.

పెళ్ళికాక ముందు అతని సర్వస్వం... ప్రాణంలో ప్రాణం అయిన తను పెళ్లయ్యాక ఎందుకూ పనికిరాని గడ్డిపోచైంది అతని దృష్టిలో తను. అరఘడియ కనిపించకున్నా బెంబేలుపడిన అతనే ఇప్పుడు నన్ను ఎన్ని రోజులైనా చూడకుండా ఉంటున్నాడు. తనని సినిమాలకీ షికార్లకీ ఆనందంగా తీసుకొని వెళ్ళిన వ్యక్తే కనీసం సినిమాకు కూడా తను బలవంతపెడితేనే ఒప్పుకుంటున్నాడు. కాని మాట నిలుపుకునేది చాలాకొద్దిసార్లే. ఇప్పుడూ అదే జరిగింది. 'తార'లో మంచి సినిమా వచ్చింది వెళ్దామండీ అని ఎంతో బలవంతంగా ఒప్పించింది.

టైమ్ దగ్గర పడ్తున్నా జాడలేదు. మనసులోని వేదన కళ్ళనీరుగా మారి బుగ్గల మీంచి జారిపోతుంది. వింత ముల్లేదో గుండెలోనే గుచ్చినట్లైంది అద్రిజకు.

ఏడవుతుండగా వచ్చాడు అచ్యుత్.

''అద్రిజ... అయాం సారీ! ఇంకోసారెప్పుడైనా వెళ్దాం'' అన్నాడు ముభావంగా ఉన్న భార్యతో.


''ఎందుకులెండి. నాతో సినిమాకొస్తే మీకేం వస్తుంది. ఎంచక్కా టైపిస్టులనేసుకుని తిరిగినా కాస్త పుణ్యం పురుషార్థం వస్తాయి'' అంది ఎక్కసంగా.

''వాట్ డు యూ మీన్?!'' అన్నాడు ఆశ్చర్యంగా.

''ఉన్నమాటే అన్నాను. తప్పేంటి? మొన్నటి దాకా అద్రీ... అద్రీ... అంటూ తిరిగిన మీరు ఇవ్వాళ హరిత హరిత అనట్లేదూ? నిన్నటి దాకా నన్ను షికార్లు తిప్పిన మీకు ఇప్పుడు నేను పనికి రాకుండా పోయానా?''

''ప్లీజ్! ట్రైటూ అండర్‌స్టాండ్ మి! అయాం వెరీ బిజీ!''

''అంత బిజీగా ఉండే మీకు పెళ్ళాం మాత్రం ఎందుకండీ? షోకేస్ బొమ్మలా! పెళ్ళాం ఉన్నా



ఒకటే లేకున్నా ఒకటే. ఉన్నారుగా మీ ప్రియు రాళ్ళు. వాళ్ళని మెయిన్‌టెయిట్రైన్ చేయడానికే టైమ్ సరిపో..'' మాట పూర్తికాకుండానే 'ఛెళ్ళు' మంది అద్రిజ చెంప.

''చూడు... నిన్ను ఇదివరకులా తిప్పడం నాకు వీలు కాదు. నాకే కాదు ఏ బాధ్యతగల భర్త కూడా ముందులా తిప్పలేడు. అందుకు కారణం పెళ్ళికాకముందు అమ్మానాన్నలు ఇచ్చే పాకెట్ మనీతో హాయిగా ఒకళ్ళ కోసం ఇంకొకళ్ళం గడిపే వాళ్ళం. కాని ఇప్పుడు మన గురించే కాదు మన పిల్లల భవిష్యత్, చదువులు, పెళ్ళిళ్ళు, ఉద్యోగాలు, సొంత ఇల్లు ఇలా ఎన్నో ఆలోచించాలి.''

''వాటికి ఇప్పుట్నుండే పద్ధతి ప్రకారం నడుచుకుంటేనే అవన్నీ సాధ్యమయ్యేది. లేదూ మన పిల్లలు ఏ ఫుట్‌పాత్ మీదో గడపాల్సి వస్తుంది. మనం ఆలోచించాల్సింది మన సంతోషం కాదు. మన పిల్లల సుఖం.''

''అంత మాత్రాన భార్యంటే ప్రేమ లేదని కాదు. ముందులా ఆ ప్రేమను వ్యక్తం చేయడానికి గంటలకొద్దీ సమయం ఉండటం లేదు. ఇది అర్థం చేసుకోలేని నీలాంటి ఎందరో భార్యలు తమని భర్తలు న్లెక్ట్ చేస్తున్నారంటూ పెరిగిన బాధ్యతలతో సతమతమయిన మగాడ్ని మరింతగా సతాయిస్తున్నారు. మొగుడు ఎప్పుడూ తన కొంగు పట్టుకునే తిరగాలి అంటే ప్రతి ఆడది ఏ లక్షాధికారినో, కోటీశ్వరుడినో మాత్రమే చేసుకోవాలి'', అంటూ ఒక్క క్షణం ఆగాడు.

నెమ్మదిగా-''అద్రిజా! రోజూ మన పెరటిలో గులాబీలను చూస్తున్నావు కదా! అవి ఎంత ముద్దొస్తుంటాయో. అలాగని ఏమరుపాటుగా వుంటే దాని ముళ్ళు గుచ్చుకొంటాయి. అలాగే మనమూ సుఖం బాగుందంటూ అందులోనే మునిగిపోతే ప్రమాదాలు అనే ముళ్ళు జీవితాన్నే 'ఛిద్రం' చేస్తాయి. భవిష్యత్ ఒక జవాబు లేని ప్రశ్నలా మిగిలిపోతుంది'' అంటూ విసురుగా వెళ్ళిపోయాడు.

కొత్త సత్యం ఏదో బోధపడుతూంటే ఇంక ఎప్పుడూ ఇలా సతాయించను అనుకుంటూ అతని వెనుకే వెళ్ళింది అద్రిజ.

అదే సమయంలో వారి తోటలోని స్నిగ్ధ గులాబీ ఒకటి ముద్దు ముద్దుగా రెక్కలు విచ్చుకుంటోంది.

☆

**ఆకెళ్ళ విజయవాణి**